సాక్షి కర్నూలు

సోమవారం, 2 జనవరి, 2023



ఆదిదంపతులకు పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు పూజలు చేసి ఆలయ ప్రదక్షిణ చేశారు.



వైభవంగా అయ్యప్ప పడిపూజ

నంద్యాల(వ్యవసాయం): గుడిపాటిగడ్డ అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆదివారం పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప సేవా సమాజ్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,624.63
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:76,290
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,761

న్యూస్‌రీల్

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయప్రాంగణం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జనవరి 1 వ తేదీ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం మల్లన్న దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ క్యూల ద్వారా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం అధికారులు ముందస్తుగానే స్వామివారి స్పర్శ దర్శనాన్ని రద్దు చేశారు. గర్భాలయ అభిషేకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. వీఐపీ బ్రేక్ సామూహిక అభిషేకాలు నిర్వహించుకున్న భక్తులకు స్వామివారి అలంకార దర్శనాన్ని మాత్రమే కల్పించారు. ఆలయ క్యూలలో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం సిబ్బంది మంచి నీరు, అల్పాహారం, బిస్కెట్లను పంపిణీ చేశారు. మల్లన్న దర్శనం అనంతరం ఆలయ పరిసర ప్రాంతాల్లోని సాక్షిగణపతి, హఠకేశ్వరం, పాలధార, పంచధార, శిఖరేశ్వరం తదితర ఆధ్యాత్మిక స్థలాలను భక్తులు సందర్శించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రతిభ ఉంటేనే సినీరంగంలో ప్రోత్సాహం



మహానందికి దర్శనార్థం వచ్చిన విక్రమ్ దంపతులు


మహానంది: ప్రతిభ ఉంటేనే సినీరంగంలో ప్రోత్సాహం, గుర్తింపు లభిస్తుందని సినీ నటుడు విక్రమ్ తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం ఆదివారం సతీసమేతంగా ఆయన మహానందికి వచ్చారు. పూజల అనంతరం విక్రమ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 1200 సినిమాల్లో నటించినట్లు చెప్పారు. తాజాగా చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమాలో ఓ పాత్ర పోషించినట్లు చెప్పారు. ప్రస్తుతం జీటీవీ, జెమిని టెలివిజన్లలో వస్తున్న సీరియల్స్‌లో కూడా నటిస్తున్నట్లు చెప్పారు.

శ్రీశైలంలో నేడు ముక్కోటి ఏకాదశి పూజలు

శ్రీశైలంటెంపుల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీశైలాలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో వేకువజామున స్వామిఅమ్మవార్ల ఉత్తరద్వార దర్శనం, రావణ వాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ముందుగా ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండపం ఉత్తర ద్వారం నుంచి వెలుపలకు తీసుకొచ్చి రావణ వాహనంపై ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు చేస్తారు. తెల్లవారుజామున మూడున్నర గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రాతఃకాల పూజలు జరిపించి, నాలుగున్నర గంటలకు మహామంగళహారతి ఇస్తారు. 6 గంటల నుంచి భక్తులకు ఆర్జిత సేవలకు, దర్శనానికి అనుమతించనున్నట్లు శ్రీశైల దేవస్థానం అధికారులు తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో కర్నూలు ప్రథమం

- ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



కర్నూలు (టౌన్): పెండింగ్ కేసుల పరిష్కారంలో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సత్వరమే న్యాయం చేయాలన్నదే పోలీస్ శాఖ ముఖ్య ఉద్దేశమన్నారు. అందులో భాగంగానే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 2,320 కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించినట్లు తెలిపారు. ఇటీవల డీజీపీ కసిరెడ్డి వెంకట రాజేంద్రనాథ్ రెడ్డి పెండింగ్ కేసుల గురించి జరిగిన సమావేశంలో కఠినమైన ఆదేశాలు జారీ చేయడంతో పాటు దిశానిర్దేశం చేశారని తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాలో మొత్తం 1,29,046 కేసులు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. డీజీపీ ఆదేశాల మేరకు ఇన్వెస్టిగేషన్ అధికారులకు శిక్షణ ఇచ్చి కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.

మురిపించ్ఛన్

నూతన ఏడాది అవ్వాతాతల ముఖాల్లో ఆనందం తాండవించింది. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌ను రూ.2,500 నుంచి రూ.2750 పెంచి అందించడంతో వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంకా తెల్లవారక ముందే లబ్ధిదారులకు ఠంచన్‌గా పింఛన్ అందించారు.

పింఛన్ మొత్తం రూ.2,750కి పెంచి అందించడంతో అవ్వాతాతల ముఖాల్లో ఆనందం

- కర్నూలు జిల్లాలో 74.41, నంద్యాల జిల్లాలో 82.55 శాతం పింఛన్ల పంపిణీ
- నోటీసులు అందుకున్న వారికీ యథాతథంగా పింఛన్లు



పింఛన్ రూ.2,750 ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న కర్నూలు బిర్లాగడ్డకు చెందిన నాగమ్మ



అవ్వ ఆనందం

ఈ అవ్వ పేరు సుజానమ్మ.. దొర్నిపాడుకు చెందిన ఈ అవ్వను ఆదివారం పొద్దుపొడవక ముందే వలంటీర్ స్వాతి నిద్రలేపారు. హ్యాపీ న్యూ ఇయర్ అని శుభాకాంక్షలు చెప్పి పింఛన్ రూ. రూ.2,750 అందజేశారు. తెల్లారక ముందే ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేయడంతో అవ్వ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

– దొర్నిపాడు



కష్టాలు తొలగాయి

ఈమె పేరు తిరుపాలమ్మ. దివ్యాంగురాలు. కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామంలో నివాసం ఉంటున్నారు. కదలలేని ఈమెకు ఇంటి వద్దకే వచ్చి వలంటీర్ నాగరాజు పింఛన్ అందజేశారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లమని, ఇప్పుడు ఆ కష్టాలన్నీ తొలగిపోయాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

– కొలిమిగుండ్ల

చాలా సంతోషం

ఈ అవ్వ పేరు లక్ష్మమ్మ..కోసిగి గ్రామానికి చెందిన ఈమె ఏ పనీ చేయలేక ఇంటివద్దే ఉంటోంది.



ఆదివారం తెల్లవారుజామునే రూ. రూ.2,750 పింఛన్ అందడంతో ఈ అవ్వ ఆనందానికి అవధుల్లేవు. బయటకు వెళ్లలేని తనలాంటి వారికి ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ దేవుడు చల్లగా చూడాలని ఆమె కోరారు.

– కోసిగి

కర్నూలు(అగ్రికల్చర్): ఒకవైపు వేలాది మందికి కొత్త పింఛన్లు ఇస్తూనే మరోవైపు వృద్ధులు, వితంతువులు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులకు పింఛన్ రూ.2,500 నుంచి రూ.2,750కి పెంచి పంపిణీ చేసే కార్యక్రమం ఆదివారం కనుల పండువగా సాగింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తెల్లవారు జామున 4 గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పి పెంచిన పింఛన్ పంపిణీ చేశారు. పొద్దుపొడవక ముందే ఇంటికే వచ్చి పింఛన్ అందించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. నూతన సంవత్సర వేడుకలు జరుగుతున్నా వార్డు, గ్రామ వలంటీర్లు పింఛన్ల పంపిణీలో నిమగ్నమయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు పెంచి వృద్ధులు, వితంతువులు, ఇతర అన్ని వర్గాల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచారనే అభిప్రాయం వ్యక్తం అయింది. వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలు కూడా ఆదివారం నుంచే మొదలయ్యాయి. డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, అడిషినల్ పీడీ షరీఫ్ తదితరులు కర్నూలు మండలంలోని పసుపల గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేశారు.

కర్నూలు 9, నంద్యాల జిల్లా 2వ స్థానం..

వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ఉదయం నుంచి ముమ్మరంగా సాగింది. సాయంత్రం 5 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,43,318 పింఛన్లకు సంబంధించి 74.41 శాతం, నంద్యాల జిల్లాలో 2,19,244 పింఛన్లకు సంబంధించి 82.55 శాతం పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో 9వ స్థానం, నంద్యాల జిల్లా 2వ స్థానంలో నిలిచింది.

నోటీసులు ఇచ్చిన వారికీ పింఛన్లు

పింఛన్లను అడ్డగోలుగా తీసేశారని టీడీపీ, ఆ పార్టీ అనుకూల మీడియా గగ్గోలు పెట్టింది. అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు మాత్రమే ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. నోటీసులు అందుకున్న వారిలో 80 శాతం మందికి పైగా యథావిధిగా పింఛన్లు పంపిణీ చేశారు. నోటీసు ఇచ్చినా తనకు పింఛన్ అందజేశారని కర్నూలు 24వ డివిజన్‌కు చెందిన షేక్ బావుద్దీన్ సంతోషం వ్యక్తం చేశారు. ఠంచన్‌గా 1వ తేదీనే పింఛన్లు అందడంతో అవ్వాతాతల్లో ఆనందం రెట్టింపు అయ్యింది.



కర్నూలు గణేష్‌నగర్‌లో కొత్తగా పింఛన్ అందుకున్న వృద్ధురాలు శేషమ్మ చిరు దరహాసం

అభివృద్ధిని పరుగులు పెట్టిద్దాం

- జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు





కలెక్టర్‌కు మొక్క ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్న జేసీ రామసుందర్ రెడ్డి, కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): నూతన సంవత్సరంలో జిల్లాను అభివృద్ధి వైపు పరుగులు పెట్టిద్దామని అధికారులకు కలెక్టర్ పి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గతేడాది ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేశారని, కొత్త సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. ఆదివారం కలెక్టర్ బంగ్లాలో నూతన సంవత్సరం–2023 పురస్కరించుకొని కలెక్టర్ పి.కోటేశ్వరరావుకు జిల్లా అధికారులు, ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఆర్డీఓ హరిప్రసాదు, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు ఉన్నారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ రమా, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ ఎం.వెంకటసుబ్బయ్య, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, సీపీఓ అప్పలకొండ, డీఎస్‌ఓ రాజారఘువీర్, డీసీసీబీ జనరల్ మేనేజర్ సోమశేఖరరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, కర్నూలు ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రనాథ్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహులు, డీపీఓ నాగరాజునాయుడు, వికలాంగ సంక్షేమశాఖ ఏడీ విజయ, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఐఅండ్‌పీఆర్ డీడీ జయమ్మ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాస్‌చంద్రబోస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, పలు డివిజన్లు, మండలాల రెవెన్యూ సిబ్బంది, కొందరు ప్రజలు తరలివచ్చి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా సందర్భాల్లో కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల సమస్యలు ఏమైనాఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి అనేక ప్రణాళికలు తయారవుతున్నాయని చెప్పారు.

మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు

నూతన సంవత్సర వేడుకల్లో అధికారులు పెద్ద ఎత్తున తరలివచ్చి కలెక్టర్, జేసీ, ప్రజాప్రతినిధులకు బొకే బదులుగా మొక్కలను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగానే కలెక్టర్, జేసీ తమకు బొకేతో శుభాకాంక్షలు తెలుపవద్దని ప్రకటించారు. దీంతో చాలా మంది మొక్కలు తీసుకొచ్చారు. కొందరు పుస్తకాలు, స్కూలు బ్యాగులు, పెన్సిళ్లు, పెన్నులను ఇచ్చి శుభాకాంక్షలు చెప్పి, కొత్త ఒరవడిని సృష్టించారు. ముున్ముందు కూడా బొకే సంస్కృతి పోయి మొక్కలు, పుస్తకాలు ఇచ్చే సంస్కృతికి నాంది పలకాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్, జేసీలకు బహుమానంగా వచ్చిన పుస్తకాలు, ఇతర వస్తువులను లైబ్రేరీలకు పంపాలని ఆదేశాలు ఇచ్చారు.

సందడిగా ప్రభుత్వ కార్యాలయాలు

నూతన సంవత్సరం వేడుకలతో ప్రభుత్వ కార్యాలయాలు సందడిగా మారాయి. 2019, 2020, 2021 నూతన సంవత్సర వేడుకల్లో కరోనా భయం ఉండేది. ఈసారి కూడా కరోనా నాలుగోవేవ్ హెచ్చరికలు ఉన్నా భయపడకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ప్రొటోకాల్‌ను పాటిస్తూ ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు చెప్పారు. దీంతో కలెక్టర్, జేసీ, డీఆర్వో, డ్వామా, డీఆర్‌డీఏ, ఇతర కార్యాలయాల్లో సందడి నెలకొంది. ప్రజాప్రతినిధులకు కూడా అభిమానులు, పార్టీ కార్యకర్తలు శుభాకాంక్షలు చెప్పారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, తదితరులు

సాంకేతికతతో కేసుల సత్వర విచారణ

కర్నూలు(లీగల్): ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో కేసుల విచారణ వేగవంతమవుతోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం న్యాయవాదుల సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. జిల్లా న్యాయమూర్తులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో కాగిత రహిత సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి నెలలో తలపెట్టనున్న జాతీయ లోక్ ఆదాలత్‌లో వీలైనన్ని కేసులను పరిష్కరించాలన్నారు. న్యాయవాదుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఆర్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కాటం రంగడు, అదనపు జిల్లా జడ్జీలు ప్రతిభాదేవి, భూపాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, సునీత, ఎం.వెంకట రమణ, సబ్ జడ్జీలు టి.కేశవ్, దివాకర్, సి.హెచ్.వి.ఎస్ శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జీలు టి.షర్మిల, జ్యోత్స్నా దేవి, కె.భార్గవి, వందన, కళ్యాణి, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు నారాయణరెడ్డి, నసీమా కౌసర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మోక్షదాయకం.. వైకుంఠ ద్వార దర్శనం

- నేడు ముక్కోటి ఏకాదశి
- ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు
- తెల్లవారుజాము నుంచే భక్తులకు దర్శనం



వేడుకలకు ముస్తాబైన కర్నూలులోని కృష్ణానగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయం

కర్నూలు కల్చరల్: మూడు కోట్ల మంది దేవతలు వైకుంఠానికి చేరుకునే పుణ్య ప్రదమైన రోజును వైకుంఠ ఏకాదశిగా, ముక్కోటి ఏకాదశిగా పిలుస్తారు. ధనుర్మాసంలో ప్రతి సంవత్సరం పున్నానికి ముందుగా వచ్చే శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి అంటారు. శ్రీహరిని ఈ రోజు దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్న పుణ్యం కలుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. సోమవారం నాడు మహా విష్ణువును ఉత్తర ద్వారం గుండా దర్శించుకుంటే స్వామి ఆ ద్వారం గుండానే అందరికి దర్శనమిస్తాడని పండితుల అభిప్రాయం. సంవత్సరానికి 24 ఏకాదశులు వస్తాయి. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం వరకు జరిగే మార్గం మధ్యలో ముక్కోటి ఏకాదశి వస్తుంది. వైకుంఠ ఏకాదశి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించే వారికి మూడు కోట్ల ఏకాదశుల వ్రతం చేసిన ఫలం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడని, మహా భారత యుద్ధంలో శ్రీ కృష్ణుడు అర్జునుడికి ఇదే రోజున భగవద్గీతను ఉపదేశించాడని విశ్వాసం ఉంది.

మోక్ష ప్రాప్తి

'ఏకాదశీ వ్రతం నామ సర్వకామ ఫల ప్రదం కర్తవ్యం సర్వదా విప్రైర్విష్ణు ప్రీణన కారణం' అంటే ఏకాదశి వ్రతం సమస్త కోరికలను తీరుస్తుంది. అందరూ ఏకాదశి వ్రతాన్ని పాటించాలి. అది వారికి నిశ్చయంగా మోక్ష ప్రాప్తిని కలిగిస్తుంది.

జిల్లా వ్యాప్తంగా వేడుకలు

కర్నూలు నగరంతో పాటు నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, బనగానపల్లె, అహోబిలం, మంత్రాలయం, పెరవలి తదితర ప్రాంతాల్లోని వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. కర్నూలు నగరంలో కృష్ణానగర్, వెంకటరమణ కాలనీ, సంకల్‌బాగ్, వాసవీ నగర్, దండెగేరి వెంకటేశ్వర స్వామి ఆలయాలు, విజ్ఞాన మందిరం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, మాస మసీదు సమీపంలోని గోదా గోకులం, జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠం, భగీరథ కాంప్లెక్స్‌లోని ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఉత్తర ద్వారాలను ఏర్పాటు చేసి స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఏకాదశి రోజున తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాలు ఏర్పాటు చేశారు.

అనంత పుణ్యఫలం సిద్ధిస్తుంది

వైకుంఠ ఏకాదశి రోజున మహా విష్ణువును ఉత్తర ద్వారంలో దర్శించుకుంటే అనంత పుణ్యఫలం సిద్ధిస్తుంది. పండుగ రోజున ఉపవాసం, జాగరణ, జపం, ధానం చేయాలి. ఏకాదశి వ్రతాన్ని నిష్ఠంగా ఆచరించాలి.

– పి. చంద్రశేఖర శర్మ, పండితులు, కర్నూలు

దోమకు ముకుతాడు!

- దోమల నియంత్రణకు విస్తృత చర్యలు
- మూడేళ్లుగా తగ్గుతున్న జ్వర పీడితుల కేసులు
- ఈ యేడాది తగ్గిన మలేరియా కేసులు
- పారిశుద్ధ్య చర్యలు, అవగాహనతో ఫలితం



మురుగు కాలువల్లో క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది



దోమల సంహారానికి ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): దోమ...చూడ్డానికి అతి చిన్న ప్రాణి. కానీ అది కుట్టాక గానీ మనకు నొప్పి తెలియదు. ఆ తర్వాత అది కుట్టిన తాలూకు వ్యాధులు అంటుకుంటే ఇక నిలువెత్తు మనిషి కూడా కుప్పకూలి మంచాన పడాల్సిందే. అందుకే దోమ పుట్టకూడదు..దోమ కుట్టకూడదని ప్రభుత్వం నినాదం తీసుకొచ్చింది. ఈ మేరకు పరిసరాల్లో, ఇళ్లల్లో దోమల నివారణ చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పుడు దోమలవ్యాప్తి సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది. తద్వారా సోకే వ్యాధులూ తగ్గాయి.

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆదోనిలో ఏరియా ఆసుపత్రి, ఎమ్మిగనూరులో వంద పడకల ఆసుపత్రి, కర్నూలులో బోధనాసుపత్రి ఉన్నాయి. ఇవి గాక 20కి పైగా అర్బన్‌హెల్త్ సెంటర్లు ఉన్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు అనుబంధంగా ఉన్న మలేరియా విభాగంలో ఒక జిల్లా మలేరియా అధికారి, ఒక అసిస్టెంట్ మలేరియా అధికారులు, ఆరుగురు సబ్‌యూనిట్ మలేరియా అధికారులు ఉంటారు. వీరు పంచాయతీ, సచివాలయాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ దోమల నిర్మూలన, నివారణ చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ప్రతి శుక్రవారం డ్రై నిర్వహిస్తున్నారు. ఆ రోజున ఇళ్లల్లోని పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించి కొన్నిగంటల సేపు ఆరనిస్తారు. ఆ తర్వాత వాటిలో నీటిని నింపి, వాటిపై మూతలు పెట్టేలా ప్రజలను చైతన్యపరుస్తున్నారు. దీనివల్ల నిల్వ ఉన్న నీటిలో దోమల గుడ్లు ఉంటే నాశనమై దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయి. సాధారణంగా దోమల ఎదుగుదలలో గుడ్లు, లార్వా, ప్యూపా, ప్రౌఢ దశలు ఉంటాయి. గుడ్లు, లార్వా దశల్లోనే వాటిని నిర్మూలిస్తే దోమలు ఉత్పత్తి కావు. దీంతో పాటు ఇళ్ల గుమ్మాలు, కిటికీలకు మెష్ ఏర్పాటు చేసుకునేలా సూచనలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ వారం వారం మురికికాలువలు శుభ్రం చేయడం, నీటినిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, దోమల నిర్మూలనకు ఫాగింగ్, యాంటిలార్వా చర్యలను వైద్య సిబ్బంది నిర్వహిస్తున్నారు.

తగ్గిన మలేరియా, పెరిగిన డెంగీ కేసులు

జిల్లాలో గత మూడేళ్లలో మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయి. దోమల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల ఫలితంగా కేసుల సంఖ్య తగ్గినట్లు అధికారులు భావిస్తున్నారు. 2016లో మలేరియా కేసుల సంఖ్య 250 ఉండగా, ఈ యేడాది అది కాస్తా కేవలం ఆరుకు తగ్గిపోయింది. అలాగే 2017లో డెంగీ కేసుల సంఖ్య 33 ఉండగా ఈ యేడాది భారీగా కేసులు నమోదయ్యాయి. 4,058 మంది అనుమానితులు, 342 కొత్త కేసులు నమోదయ్యాయి. వర్షాలు అధికంగా కురవడంతో నీటినిల్వలు ఎక్కువగా ఉండటంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికితోడు ఇంటింటా జ్వరపీడితులను గుర్తించేందుకు ఫీవర్ సర్వే చేయడం, ర్యాపిడ్ కిట్లతో పరీక్షలు నిర్వహించడంతో ఎక్కువ కేసులు బయటపడినట్లు సమాచారం. కాగా ఆరేళ్లుగా కనిపించని జపనీస్ ఎన్‌సెఫలైటిస్(మెదడువాపు) కేసులు ఈ యేడాది మూడు బయటపడ్డాయి.

ఏడేళ్లుగా మలేరియా, డెంగీ కేసుల వివరాలు

సంవత్సరం	మలేరియా	డెంగీ
2016	250	33
2017	16	267
2018	19	5
2019	8	63
2020	14	10
2021	18	170
2022	6	342

దోమల నివారణకు నిరంతర కార్యక్రమాలు



జిల్లాలో దోమల కారణంగా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో మలేరియా కేసులను తగ్గించడంలో గణనీయమైన ప్రగతి సాధించాం. అయితే ఈ ఏడాది డెంగీ కేసులు కాస్త అధికంగా పెరిగాయి. మలేరియా, డెంగీ కేసులు వచ్చిన చోటకు వెంటనే మా వైద్యబృందాన్ని అక్కడకు పంపించి సర్విలెన్స్ చేయిస్తున్నాం. కేసు వచ్చిన చుట్టుపక్కల ప్రాంతాల్లో దోమలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో పాటు పంచాయతీ, సచివాలయ ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ దోమల గుడ్లు, లార్వాల నిర్మూలనకు చర్యలు చేపడుతున్నాం. **–నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు**

క్లుప్తంగా

శ్రీ మఠంలో కన్నడ నటుడు జగ్గేష్



పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న జగ్గేష్

మంత్రాలయం రూరల్: కన్నడ నటుడు జగ్గేష్ ఆదివారం మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, అనంతరం శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, స్వామివారి మెమెంటో, ఫలమంత్రాక్షితలిచ్చి ఈయనను ఆశీర్వదించారు.

పోలీసుల విధులకు ఆటంకం

- టీడీపీ నేతలపై కేసు నమోదు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలం పొట్టిపాడు గ్రామంలో పోలీసుల విధుల ఆటంకం కల్గించిన గ్రామ టీడీపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మౌలానీ తెలిపారు. ఆదివారం ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు.. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శనివారం రాత్రి పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన కోవెలకుంట్ల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, టీడీపీ నేత గువ్వలసుబ్బారెడ్డి, సోదరుడు గువ్వల నాగేందర్‌రెడ్డి అలియాస్ సుందర్‌రెడ్డి, మరికొందరు పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించి విధులకు ఆటంకం కల్గించారు. ఈ మేరకు కానిస్టేబుల్ మాలిక్‌బాషా ఫిర్యాదుతో టీడీపీ నాయకులపై ఐపీసీ 341, 335, రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలుకు రజతం



కర్నూలు జట్టును అభినందిస్తున్న రామాంజనేయులు

కర్నూలు (టౌన్): కదిరి పట్టణంలో డిసెంబర్ 30, 31 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో కర్నూలు క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకున్నారు. అనంతపురం జిల్లా కదిరిలోని హరీష్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఫైనల్స్ పోటీల్లో అనంతపురం జట్టు 8–7 గోల్స్‌తో కర్నూలుపై గెలిచింది. దీంతో కర్నూలు జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో రాష్ట్ర ఒలింపిక్ సంఘం సభ్యులు రామాంజనేయులు కర్నూలు బాలికల హ్యాండ్‌బాల్ జట్టును అభినందించారు.

బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ సస్పెన్షన్

బొమ్మలసత్రం: గన్ మిస్‌ఫైర్ ఘటనలో బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ ఓబులేసును ఉన్నతాధికారులు ఆదివారం సస్పెండ్ చేశారు. డిసెంబర్ 26న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శ్రీశైలం పర్యటనకు వచ్చారు. ఈ క్రమంలో ఎస్సై ఓబులేసుకు అధికారులు కీలక ప్రాంతంలో బందోబస్తు బాధ్యతలు అప్పగించారు. ఎస్‌ఐ తన సర్వీస్ రివాల్వర్ మరిచిపోవటంతో శ్రీశైలం పోలీస్‌స్టేషన్‌లోని ఆయుధాలగదిలో ఉన్న ఓ రివాల్వర్ తీసుకున్నాడు. దానిని పరిశీలించే క్రమంలో మిస్‌ఫైర్ కావడంతో బుల్లెట్ గది పైభాగంలో తాకింది. ఈ విషయంపై కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ విచారణ జరిపి విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు ఎస్‌ఐ ఓబులేసును సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

తైక్వాండో క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులకు కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈనెల 26 నుంచి 28 వరకు వైఎస్సార్ జిల్లా రైల్వే కోడూరులో తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. అండర్–19 విభాగంలో వహీమ్ (కాంస్యం) రాధిక (కాంస్యం) సాధించారు. అండర్ 17 విభాగంలో పోటీలను డిసెంబర్ 28 నుంచి 30 వరకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించగా వికాస్‌రాజ్ (వెండి) తరుణేశ్వర్ (కాంస్యం) సాధించారు. వీరితోపాటు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన సుగంధిని, విజిత, భరత్, సామిత్‌లను కూడా కలెక్టర్ అభినందించారు.

రాఘవేంద్రుడికి ప్రత్యేక పూజలు





ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం, స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మంత్రాలయం రూరల్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు దేశం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మఠం అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులు భారీగా తరలిరావడంతో మఠం పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి. పీఠాధిపతి సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనంకు వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథోత్సవాలపై ఊరేగించారు.

వేధింపులు తాళలేక భర్త గొంతు కోసిన భార్య

- నంద్యాల ప్రభుత్వాసుపత్రి వద్ద ఘటన
- మెరుగైన వైద్య కోసం కర్నూలుకు తరలింపు



లక్ష్మీదేవి



చికిత్స పొందుతున్న బ్రహ్మయ్య

బొమ్మలసత్రం: అస్తమానం అనుమానంతో వేధించడమేకాక హత్య చేసేందుకు యత్నించిన భర్తను భార్య బ్లేడ్‌తో గొంతుకోసింది. ఈ ఘటన నంద్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు .. గోస్పాడు మండలం కానాలపల్లి గ్రామానికి చెందిన బ్రహ్మయ్య, లక్ష్మీదేవి దంపతులు. 15 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి ఇద్దరు మగ సంతానం. బ్రహ్మయ్య మద్యానికి బానిసై రోజూ స్నేహితులతో కలిసి గ్రామంలో ఖాళీగా తిరిగేవాడు. లక్ష్మీదేవి కూలీ పని చేసి వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలను చదివించుకుంటుంది. అయితే, భర్త ఆమెపై అనుమానం పెంచుకుని పిల్లల ముందే చితకబాదేవాడు. గత నెల 24వ తేదీ రాత్రి ఏకంగా ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో నిద్రిస్తుండగా బ్లేడ్‌తో గొంతు కోసి పరారయ్యాడు. స్థానికులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాణాలతో బయటపడిన విషయం తెలుసుకున్న బ్రహ్మయ్య ఎలాగైనా ఆమెను చంపేయాలని ఆదివారం మళ్లీ పూటుగా మద్యం తాగి ఆసుపత్రికెళ్లాడు. మాట్లాడాలని చెప్పి భార్యను ఆసుపత్రి బయటకు తీసుకొచ్చి బ్లేడ్‌తో దాడికి యత్నించాడు. సహనం కోల్పోయిన లక్ష్మీదేవి ఒక్క సారిగా తిరగబడి బ్రహ్మయ్య చేతిలో ఉన్న బ్లేడ్ లాక్కొని అతడి గొంతు కోసింది. బాధితుడికి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడే ఉన్న ఆసుపత్రి సిబ్బంది ఆసుపత్రిలో చేర్చారు. అయితే, అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు లక్ష్మీదేవిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

యువకుడి నిజాయితీ



పోలీసుల సమక్షంలో బంగారు ఆభరణాలు నగదును ఇస్తున్న సుధాకర్‌ఆచారి

పత్తికొండ రూరల్: తనకు దొరికిన విలువైన బంగారం, నగదును బాధితులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు పత్తికొండకు చెందిన సుధాకర్‌ఆచారి. మదనంతపురం గ్రామానికి చెందిన కురువ లక్ష్మి ఆదివారం హోసూరు సమీపంలోని యోగి నరసింహస్వామి రథోత్సవానికి వెళ్లింది. ఆలయంలో స్వామిని దర్శించుకుని పర్సును పోగొట్టుకోగా సుధాకర్‌కు దొరికింది. ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులకు చెప్పి మైక్ ద్వారా అనౌన్స్‌మెంట్ చేయించారు. పోలీసుల సమక్షంలో పర్సును కురువ లక్ష్మికి అందజేశారు. పర్సులో 4 తులాల బంగారు చైన్, చెవి కమ్మలు, రూ.6వేలు నగదు ఉంది. నిజాయితీని చాటుకున్న సుధాకర్ ఆచారిని పత్తికొండ ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, గోపాల్ సన్మానించారు.

వృద్ధురాలి వేషంలో ప్రదర్శన



వృద్ధురాలి వేషంలో ప్రదర్శన నిర్వహిస్తున్న బంగి అనంతయ్య

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మాజీ మేయర్ బంగి అనంతయ్య మరోసారి వినూత్నంగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధులకు ఇచ్చే పింఛన్ రూ.2,750కు పెంచడంతో వృద్ధురాలి వేషం వేశాడు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట పెంచిన పింఛన్‌ను తీసుకొని సంతోషపడే వృద్ధురాలిగా ప్రదర్శన నిర్వహించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా వృద్ధులను మానవతావాదంతో ఈ విధంగా ఆదుకోవడంలేదన్నారు. పింఛన్ పెంచడం గొప్ప విషయమని, వృద్ధులందరూ సీఎంజగన్‌కు రుణపడి ఉంటారని అన్నారు.

విరబూసిన ఆశలు!

తుగ్గలి: మొన్నటి వరకు విపరీతమైన మంచు, తుఫాను ప్రభావం. ఈ అననుకూల వాతావరణంలోనూ మామిడి చెట్లకు పూత విరగ్గాసింది. ఎద్దులదొడ్డి వద్ద ఓ రైతు తోటలో మామిడి చెట్లన్నీ పూతతో కళకళలాడుతున్నాయి. ఏటా ఏదో ఓ కారణంతో నష్టపోతున్న మామిడి రైతులకు విరబూసిన పూత ఆశలురేకెత్తిస్తోంది.



ఎద్దులదొడ్డి వద్ద మామిడి తోటలో చెట్లకు విరగ్గాసిన పూత

డ్రైయినేజీ గుంతలో పడి భక్తుడు మృతి



మృతి చెందిన ప్రభాకరన్ (ఫైల్)

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చి డ్రైనేజీ గుంతలో పడి ఓ భక్తుడు మృతి చెందాడు. ఈ ఘటన మంత్రాలయంలోని కర్ణాటక అతిథి గృహం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడు ప్రాంతానికి చెందిన ప్రభాకరన్ అనే వ్యక్తి మరి కొంత మందితో కలిసి మంత్రాలయం వచ్చి కర్ణాటక అతిథిగృహంలో బస చేశారు. శనివారం మధ్యాహ్నం ప్రభాకరన్ కాంపౌండ్‌లో శిథిలావస్థకు చేరిన మ్యాన్‌హోల్‌పై నిలబడి మలవిసర్జన చేస్తుండగా ప్రమాదవశాత్తు డ్రైయినేజీ గుంతలోకి పడిపోయాడు. ఎంతసేపటికీ కన్పించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం దుర్వాసన వస్తుండటంతో గమనించిన స్థానికులు పంచాయతీ సిబ్బంది సహాయంతో ప్రభాకరన్(50) మృతదేహాన్ని బయటకు తీశారు.

నల్లమల ఘాట్‌లో లారీ బోల్తా



ఘాట్‌లో తిరిగి పడిన లారీ

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో ఓ లారీ తిరిగి పడింది. ఆదివారం నంద్యాల నుంచి గిద్దలూరు వైపు ఆహార పదార్థాల లోడుతో వెళ్తుండగా ఎదురొచ్చిన మరో వాహనాన్ని తప్పించబోగా బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. ఈ క్రమంలో లారీ అదుపుతప్పి తిరిగి పడింది. అదృష్ట వశాత్తు డ్రైవర్, క్లీనర్‌లు ప్రమాదం నుంచి బయటపడ్డారు. విషయం తెలుసుకున్న రోడ్‌సేఫ్టీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. స్థానికుల సహకారంతో లారీని యథాస్థానానికి చేర్చి పంపించినట్లు స్థానికులు తెలిపారు.

బైక్‌కు నిప్పు



ద్విచక్ర వాహనానికి నిప్పంటించిన దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని పెద్దగుమ్మడాపురం పొలిమేర సమీపంలో ఓ వ్యక్తి బైక్‌ను కొందరు నిప్పంటించారు. వివరాల్లోకి వెళితే.. ముసలిమడుగు గ్రామానికి చెందిన మహమ్మద్ ఇసాక్ పెద్దగుమ్మడాపురం గ్రామ సమీపంలో 15 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్నాడు. ఆదివారం పొలానికి నీరు పెట్టేందుకు తన మోటారు బైకుపై వెళ్లాడు. బైకును కొండవాగు ప్రాంతంలో ఉంచి పొలం వద్దకు నీరు పెట్టుకునేందుకు వెళ్లాడు. అక్కడ పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన రమణ నాయక్ మరో ఇద్దరితో కలసి మద్యం సేవిస్తున్నారు. గతంలో నాయక్‌పై నమోదైన దొంగతనం కేసులో ఇసాక్ భార్య సాక్షిగా ఉంది. దీనిని మనసులో పెట్టుకున్న రమణనాయక్ తనను చంపాలని ఉద్దేశంతో బైకుకు నిప్పు అంటించాడని బాధితుడు కొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మరబోట్ల వివాదం



దాడికి యత్నిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సంగమేశ్వరం సమీపంలో మరబోట్ల నిర్వహణకు సంబంధించిన విషయమై రెండు తెలుగు రాష్ట్రాల నిర్వాహకుల మధ్య వివాదం ఏర్పడింది. ఆదివారం నదిలో బోట్లలోనే ఉంటూ దాడి చేసుకునేందుకు యత్నించారు. తెలంగాణ వారు రెండువైపులా బోట్లను తిప్పుతూ తమ జీవనంపై దెబ్బకొడుతున్నారని ఆంధ్ర మరబోట్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది భూమి కాదు, నీరు అని నీటిపై ఎవ్వరైన ఎక్కడైనా తిప్పుకోవచ్చని ఆంధ్ర బోటు నిర్వాహకులపై తెలంగాణ వారు దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సమస్య పరిష్కారం అయ్యే వరకు ఎవరూ బోట్లను తిప్పకూడదని ఆదేశాలు ఇచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.